క్లుప్తంగా

టంగుటూరికి నివాళి

తిరువూరు: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం తిరువూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తిరువూరు రాజీవ్ భవన్‌లో టంగుటూరి చిత్రపటానికి పార్టీ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, బొడ్డు ప్రకాశరావు, జీవన్‌బాబు, కొత్తగుండ్ల గోపాలకృష్ణ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

చవితి ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం

ఇబ్రహీంపట్నం: ప్రజల భాగస్వామ్యంతోనే సనాతన ధర్మానికి ఆధ్యాత్మిక వెలుగులు సంతరించుకుంటాయని జిల్లా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు త్రిమూర్తిరాజు అన్నారు. వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మాదిరిగా జిల్లాలో కూడా ఒకే రోజు నిమజ్జనాలు జరిపేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. పోస్టర్లు ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పవిత్ర సంగమం ఘాట్‌లో వ్యర్థాల తొలగింపు

ఇబ్రహీంపట్నం: ఇటీవలి కాలంలో కురిసిన అధిక వర్షాలకు పవిత్ర సంగమం వద్ద మెట్లపై పేరుకుపోయిన వ్యర్థాలు, మట్టిని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు పారిశుద్ధ్య కార్మికులతో తొలగింపు పనులు శనివారం చేపట్టారు. వరద నీటితో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తచెదారం మెట్లపై పేరుకుపోయింది. తొలగించిన వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. ఘాట్లను శుభ్రం చేయడం ద్వారా పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

విద్యుత్ బిల్లుల కౌంటర్ మార్పు చేయండి

ఇబ్రహీంపట్నం: స్థానిక రింగ్ సెంటర్‌లో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు విద్యుత్ శాఖ డీఈ వసంతరావుకు సూచించారు. రింగ్ సెంటర్‌లో శనివారం వాహనాల తనిఖీ నేపథ్యంలో రాంగ్ రూట్‌లో వెళ్లేవారిని ప్రశ్నించగా విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసమని చెబుతున్నారని డీఈ వసంతరావుకు ఎస్ఐ వివరించారు. బిల్లుల చెల్లింపునకు రాంగ్ రూట్‌లో వినియోగదారులు రావడం వలన ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. విద్యుత్ శాఖ కార్యాలయానికి తుమ్మలపాలెం వరకు వెళ్లి యూటర్న్ తీసుకుని తిరిగి రావాల్సి ఉన్నందున రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదకరమన్నారు. వచ్చే నెలలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం రింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఈ చెప్పారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



నూజివీడు: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని స్నేహ రైడ్స్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎం.లక్ష్మి పేర్కొన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నూజివీడు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను నియంత్రించాలంటే ఒకే జీవిత భాగస్వామితో మాత్రమే శృంగారంలో పాల్గొనాలన్నారు. అపరిచిత వ్యక్తులతో, ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లో కలవకూడదని, ఒకవేళ కలవాల్సి వస్తే కండోమ్‌ను ధరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి. అనురాధ, పాఠశాల ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సురవరం మృతికి సంతాపం

నూజివీడు: సీపీఐ అగ్ర నాయకులు, మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సురవరం లేని లోటు కమ్యూనిస్టు పార్టీలో ఎవరూ తీర్చలేనిదన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డితో నూజివీడు కమ్యూనిస్టు పార్టీకి ఎనలేని అనుబంధం ఉందని, పార్టీ కార్యక్రమాలలో భాగంగా అనేక దఫాలు నూజివీడుకు విచ్చేసారని కొమ్మన పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు.

జ్యేష్ఠ రమేష్‌బాబుకు పరామర్శ



నూజివీడు: మైలవరం మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబును నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం పరామర్శించారు. రమేష్‌బాబు మాతృమూర్తి విమలాదేవి ఇటీవల మరణించిన నేపథ్యంలో జి. కొండూరు మండలం కుంటముక్కలలోని రమేష్‌బాబు నివాసానికి వెళ్లి విమలాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

యూరియా కోసం పడిగాపులు

- కావాల్సింది 50 టన్నులు.. వచ్చింది 10 టన్నులు
- పీఏసీఎస్‌ల వద్ద రైతుల ఎదురుచూపులు
- పోలిశెట్టిపాడు పీఏసీఎస్ పాలకవర్గం నిర్లక్ష్యం
- యూరియా సరఫరాలో అధికారుల వైఫల్యంపై రైతుల ఆగ్రహం



ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

తిరువూరు: ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో యూరియా కోసం రైతులు శనివారం పెద్దఎత్తున తరలి రావడంతో స్టాకు లేదని సిబ్బంది చేతులెత్తేశారు. ఈ సొసైటీ పరిధిలో పోలిశెట్టిపాడు, మారేపల్లి, గున్నచింతలపాడు, గోపాలపురం, జీళ్ల కుంట, వల్లంపట్ల గ్రామాలుండగా సుమారు 50 టన్నుల యూరియా అవసరం ఉందని వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ మేరకు సొసైటీ ఇండెంట్ పంపకపోవడం, కేవలం 10 టన్నుల యూరియా మాత్రమే రావడంతో రైతులకు అందించడంలో విఫలమయ్యారు. వరి, పత్తి, మిర్చి పంటలకు ప్రస్తుత తరుణంలో కాంప్లెక్సు ఎరువులతో పాటు యూరియా కూడా అవసరముండగా, బయట డీలర్ల వద్ద స్టాకు లేదని, పీఏసీఎస్‌లో మాత్రమే లభ్యమవుతుండటంతో వచ్చామని రైతులు తెలిపారు. సొసైటీలలో యూరియా బస్తా రూ.266 కాగా, బయట డీలర్ల వద్ద రూ.500లకు విక్రయిస్తుండటంతో పోలిశెట్టిపాడు పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల నుంచి 400 మందికి పైగా రైతులు తరలివచ్చారు. 220 బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉందని, ఒక్కొక్క రైతుకు ఒక బస్తా మాత్రమే యూరియా సరఫరా చేస్తామని సొసైటీ సిబ్బంది చెప్పడంతో రైతులు సొసైటీ వద్ద పడిగాపులు పడగా మరో 10 టన్నుల యూరియా రెండు, మూడు రోజుల్లో వస్తుందని రైతులకు సర్దిచెప్పి పంపేశారు.

కనీస సౌకర్యాలు లేక అవస్థలు

యూరియా కోసం వచ్చిన రైతులకు పోలిశెట్టిపాడు పీఏసీఎస్ వద్ద కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. తాగునీరు లేక ఎండలో అల్లాడిన రైతుల్లో ఒక మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. వృద్ధులైన రైతులు సైతం తాగునీటి కోసం అల్లాడారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యూరియా సరఫరా చేయడంతో తాము వేచి ఉండే పరిస్థితి లేదని, ఇప్పుడు కేవలం సొసైటీల్లో మాత్రమే స్టాకు ఉంచడం, ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరకు విక్రయిస్తుండటంతో తమ ఇబ్బందులు చెప్పనలవి కాకుండా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. యూరియాకు ఉన్న డిమాండ్‌ను గుర్తించి స్టాకు తెప్పించడంలో పోలిశెట్టిపాడు పీఏసీఎస్ పాలకవర్గం విఫలమైందని విమర్శిస్తున్నారు.

వెంటనే సరఫరా చేయాలి



ఖరీఫ్ సీజన్‌లో యూరియాకు ఉన్న డిమాండ్‌ను ముందుగా అంచనా వేసినప్పటికీ వ్యవసాయ శాఖ రైతులకు అందుబాటులో ఉంచకపోవడం గర్హనీయం. రైతుల ఇబ్బందులు పట్టించుకోకుండా మొక్కుబడిగా యూరియా సరఫరా చేసి చేతులు దులుపుకున్న అధికారులు ఇకనైనా డిమాండ్‌ను గుర్తించి కొరత తీర్చాలి.

– ఏలూరి శివాజీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు

బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు



పీఏసీఎస్‌లకు యూరియా తక్కువ మోతాదులో సరఫరా చేయడంతో రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద రెట్టింపు ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు వేసిన రైతులు యూరియా కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం వెంటనే యూరియా సరఫరా చేయాలి.

– తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి, పోలిశెట్టిపాడు

బుడమేరు ముంపు నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



వెలగలేరు వద్ద బుడమేరుపై ఉన్న హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న నాయకులు

జి.కొండూరు: బుడమేరు ముంపు నివారణ చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.కాశీనాథ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులుతో కలిసి బాబూరావు వెలగలేరు వద్ద బుడమేరుపై ఉన్న హెడ్ రెగ్యులేటర్, డైవర్షన్ చానల్‌ను శనివారం పరిశీలించారు. బాబూరావు మాట్లాడుతూ ఆగస్టు నెలాఖరు వచ్చినా ఇంకా నిర్వహణ పనులు పూర్తి కాకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. కొండపల్లి శాంతినగర్ ప్రాంతంలో డైవర్షన్ కెనాల్‌కు గండి పడిన ప్రదేశంలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఆలస్యంగా ప్రారంభించడం వల్ల కొంతమేర మాత్రమే పూర్తయిందన్నారు. డైవర్షన్ కెనాల్ లోతు, వెడల్పు, సామర్థ్యం పెంచే పనులను చేపట్టకపోవడం దుర్మార్గమని చెప్పారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద అదనపు సామర్థ్యం, అదనపు నీరు నిల్వ ఉంచే చర్యలు ఇప్పటి వరకు చేపట్టలేదన్నారు. గత సంవత్సరం వరద సందర్భంలో హడావిడి చేసిన పాలకులు, ఆ తరువాత శాశ్వత ముంపు నివారణ చర్యలకు అవసరమైన నిధులను విడుదల చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వం భరోసా కల్పించకపోవడంతో చిన్నపాటి వర్షాలు వచ్చినా ప్రజలు వరద భయంతో భయాందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇకనైనా బుడమేరు ప్రక్షాళన చర్యలు చేపట్టి ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



తుక్కులూరులోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ, తహసీల్దార్, ఏఓ

నూజివీడు: ఎరువుల దుకాణాల యజమానులు రైతులకు తొలి ప్రాధాన్యత కింద యూరియాను విక్రయించాలని, యూరియాను కొనుగోలు చేసే రైతులకు ఇతర వస్తువులను ముడిపెట్టి అమ్మవద్దని ఏడీఏ జి. విద్యాసాగర్ పేర్కొన్నారు. నూజివీడు మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఏడీఏతో పాటు తహసీల్దార్ గుగులోతు బద్రూనాయక్, ఏఓ పలగాని చెన్నారావు శనివారం తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియాను ఎమ్మార్పీకే విక్రయించాలని, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణదారులు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నూజివీడు మండలంలో యూరియా నిల్వలు 48 మెట్రిక్ టన్నులు ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన పడకుండా యూరియాను కొనుగోలు చేయవచ్చని చెప్పారు.

నూజివీడు: నియోజకవర్గంలోని ఎరువుల దుకాణాలను ప్రతి రోజూ తనిఖీ చేయాలని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని రాజీవ్‌సర్కిల్ వద్ద ఉన్న ఎరువుల దుకాణాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడుతూ ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. తహసీల్దార్ గుగులోతు బద్రూనాయక్, ఏడీఏ జి. విద్యాసాగర్, ఏఓ పలగాని చెన్నారావు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని పలు ఎరువుల షాపులను వ్యవసాయ అధికారి బి.శివ శంకర్ శనివారం తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఎస్ఐ రామకృష్ణ, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద హైకోర్టు న్యాయవాది ఆందోళన

అక్రమ సాగుదార్లపై చర్యకు డిమాండ్



ఆందోళన చేస్తున్న లక్ష్మీనరసింహారావు

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం గ్రామంలో 11.50 ఎకరాలలో అక్రమంగా సాగుచేస్తున్న పరసా రాములు, వాకా సత్యనారాయణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ హైకోర్టు న్యాయవాది గొట్టేటి లక్ష్మీనరసింహారావు తన కుమార్తెతో కలిసి శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ నరసాపురానికి చెందిన తన నాయనమ్మ గొట్టేటి శేషమ్మ మృతిచెందిన అనంతరం భూమి సాగు చేస్తున్న పరసా రాములు, వాకా సత్యనారాయణలకు తాను నోటీసులు ఇచ్చినప్పటికీ ఆ భూమిలో అక్రమంగా సాగు చేస్తున్నారన్నారు. దీనిపై ఆర్ఓఆర్ కేసు పెట్టినా న్యాయం జరగలేదని వాపోయాడు. తహసీల్దార్ నచ్చజెప్పినా అక్రమంగా సాగుచేస్తున్న ఇద్దరిపై అరెస్టు వారెంట్ ఇప్పిస్తేనే ఆందోళన విరమిస్తానని పేర్కొంటూ రాత్రి 9 గంటలు అయినా ఆందోళన విరమించలేదు. దీనిపై తహసీల్దార్ లక్ష్మీకల్యాణిని వివరణ కోరగా అక్రమ సాగు విషయంలో ఆర్ఓఆర్ విచారణ జరుగుతోందని నోటీసులు ఇచ్చామని, పూర్తి స్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థుల ధర్నా

నూజివీడు: కూటమి ప్రభుత్వం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తోందని, ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తోందని ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కె. లెనిన్ ధ్వజమెత్తారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో శనివారం విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. లెనిన్ మాట్లాడుతూ నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. 25న చలో కలెక్టర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొండపల్లి హాస్పిటల్ వద్ద బంధువుల ఆందోళన



దావూద్ హుస్సేన్ (ఫైల్)

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గ్యాస్ సమస్యతో కొండపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో ప్రాథమిక వైద్యం చేయించుకున్న యువకుడు రెండో రోజు విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సకాలంలో వైద్యం అందకపోవడం వల్లే నా భర్త మృతి చెందాడని కొండపల్లి వైద్యశాల ఎదుట శనివారం మృతురాలి భార్య, బంధువులు ఆందోళనకు దిగారు. సేకరించిన వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన షేక్ దావూద్ హుస్సేన్ (38) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గ్యాస్ సమస్యతో కొండపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లాడు. అక్కడి వైద్యుడు ప్రాథమిక చికిత్స అనంతరం అనుమానంతో ఈసీజీ తీయించారు. ఈసీజీలో సమస్య ఏమీలేదని మందులు ఇచ్చి మరుసటి రోజు రమ్మని ఇంటికి పంపించారు. మరుసటి రోజు కొండపల్లి వైద్యశాలకు వెళ్లకుండా విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందాడు. కొండపల్లిలో తీసిన ఈసీజీలోనే సమస్య ఉందని, అదేరోజు వస్తే ఫలితం ఉండేదని కొండపల్లి వైద్యుడిపైకి నెపం నెట్టేశాడు. కొండపల్లి డాక్టర్ నిర్లక్ష్యంతోనే మరణం సంభవించిందని మృతుని బంధువులను రెచ్చగొట్టారు. కోపోద్రిక్తులైన బంధువులు కొండపల్లి వైద్యశాలకు వచ్చి మీవలనే నాభర్త మరణించాడని ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న సీఐ చంద్రశేఖర్, క్రైమ్ ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పట్టణ పెద్దలు మృతుని బంధువులు, వైద్యశాల యాజమాన్యం మధ్య రాజీ కుదర్చడంతో ఆందోళన విరమించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విస్సన్నపేటలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధురి

నూజివీడు: పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ర్యాలీలు నిర్వహించి పరిశుభ్రత వల్ల కలిగే ఉపయోగాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. డ్రెయినేజీల్లో ఉన్న చెత్తచెదారాన్ని తొలిగింప చేశారు.

మైలవరం: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని రెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శి రామారావు అన్నారు. రెడ్డిగూడెం గ్రామంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. పరిశుభ్రత, దోమల నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఇటీవలి కాలంలో కురిసిన అధిక వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ కావూరి చైతన్య పేర్కొన్నారు. గుంటుపల్లిలో జరిగిన స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్యంపై చేపడుతున్న చర్యలు, ఇంటింటి చెత్త సేకరణ, తాగునీటి సరఫరా వంటి వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ గుంటుపల్లిగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో సునీత శర్మ, తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ మనోజ్, సర్పంచి భుక్యా కవిత పాల్గొన్నారు.ఎన్టీటీపీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ శివ రామాంజనేయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఉద్యోగి తమ ఇంటి నుంచి స్వచ్ఛత పాటించాలని సూచించారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

విజయవాడరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచిస్తూ శనివారం గ్రామాల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పైడూరుపాడు గ్రామంలో డ్రెయిన్లు శుభ్రం చేయించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రజలతో కార్యదర్శి పి. వీరబాబు ప్రతిజ్ఞ చేయించారు. రాయనపాడు గ్రామంలో కార్యదర్శి వెంకటస్వామి గ్రామ సచివాలయం సిబ్బందితో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలో గ్రామ కార్యదర్శి దుర్గాప్రసాద్ సిబ్బందితో డ్రెయినేజీ, కాలువల్లో వ్యర్థాలను తొలగింప జేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఆర్డీఓ

విస్సన్నపేట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీఓ కె. మాధురి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటి చెత్త సేకరణ తదితర అంశాలను ఆర్డీఓ పరిశీలించారు. అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి చక్రాణి, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ ప్రసాద్, వైద్యాధికారి శ్రీనివాసరావు, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, ఎంఈఓ 2 సుధాకర్, పాఠశాల హెచ్ఎం శోభారాణి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారానే మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బొద్దనపల్లి వీధులలో పరిసరాలను శుభ్రం చేసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

మైలవరం: ప్రణాళికాబద్ధంగా చదవడం ద్వారా విజయాలు సాధించవచ్చని లయన్స్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంటార్, కేవీఆర్ జూనియర్ కళాశాల ప్రొఫెసర్ లయన్ డాక్టర్ యర్రంరెడ్డి గాంధీ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్ఎస్‌కే పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

హైస్కూల్‌కు మైక్ బహూకరణ



నూజివీడు: మండలంలోని మద్దాయికుంట హైస్కూల్‌కు గ్రామస్తులు శనివారం రూ.20 వేల విలువ చేసే మైక్‌ను బహూకరించారు. ఇటీవల మరణించిన గ్రామానికి చెందిన చిక్కాల నరేంద్ర జ్ఞాపకార్థం అతని మిత్రులు, మర్రిబంధం యూత్ తరఫున ఎస్ఎంసీ చైర్మన్ యర్రబాల శివ రామకృష్ణ ప్రోత్సాహంతో దీనిని హైస్కూల్ హెచ్ఎం దారపురెడ్డి భాస్కరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఆర్వో ప్లాంటు కోసం రూ. 2 లక్షలు వితరణ



తిరువూరు: మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్న నీటి కారణంగా గ్రామస్తులు కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో తిరువూరు ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శీలం నాగనర్సిరెడ్డి గ్రామంలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు రూ.2 లక్షలు వితరణ ఇచ్చారు. గ్రామ సర్పంచి బంకా వెంకటేశ్వరరావు విజ్ఞప్తి మేరకు నాగనర్సిరెడ్డితో పాటు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు రూ.50 వేలు, వేమిరెడ్డి రాజారెడ్డి రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ నిధులతో కొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని నాగనర్సిరెడ్డి చెప్పారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

నూజివీడు: బాల్య వివాహాలతో ఆడపిల్లల్లో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివ పార్వతి అన్నారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలోని ఏఎం తోట అంగన్‌వాడీ కేంద్రంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయకూడదన్నారు. పిల్లలను పనిలో పెడితే చట్టరీత్యా నేరమని, అలాంటి నేరాలకు కఠిన శిక్షలు విధిస్తారని వివరించారు.

దోమల మందు పిచికారీ



సాక్షి ఎఫెక్ట్

తిరువూరు: 'ప్రబలుతున్న విషజ్వరాలు' శీర్షికన ఈ నెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి తిరువూరు నగర పంచాయతీ అధికారులు స్పందించారు. దోమల నిర్మూలనకు పట్టణంలోని 8, 14, 15 వార్డుల్లో శనివారం మలాథియాన్ పిచికారీ, ఫాగింగ్ చేశారు. నగర పంచాయతీ కమిషనర్ మనోజ, వార్డు శానిటరీ కార్యదర్శులు రవి నాయక్, కిషన్ పర్యవేక్షించారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



మైలవరం: క్షేత్ర పర్యటనల ద్వారా మొక్కల పెంపకంపై అవగాహన పెంపొందించుకోవాలని వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె. రాముడు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రం విద్యార్థులు క్షేత్ర సందర్శనలో భాగంగా విజయవాడ మున్సిపాలిటీ నర్సరీని సందర్శించి ఆర్గానిక్ పద్ధతుల్లో మొక్కలు పెంచుకునే విధానాన్ని తెలుసుకున్నారు. ఆర్గానిక్ కంపోస్టు, వర్మి కంపోస్టును ఉపయోగించి వివిధ రకాల పూలమొక్కలు పెంచుతున్నారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలను సందర్శించి అక్కడ జరుగుతున్న నేషనల్ సెమినార్‌లో పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సందర్శించి అంబేడ్కర్ జీవిత విశేషాలను తెలుసుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీలో జిల్లా ప్రథమస్థానంలో నాగరాజు



తిరువూరు: మెగా డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ గణిత శాస్త్ర విభాగంలో గంపలగూడెంకు చెందిన కోట నాగరాజు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎస్సీ కేటగిరీలో ప్రథమస్థానంలో నిలిచారు. 100కి 82.56 మార్కులతో నాగరాజు డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ లెక్కలు పోస్టు సాధించడంపై గ్రామస్తులు అభినందించారు.

శశాంకకు జిల్లా 29వ ర్యాంకు



మైలవరం: రెడ్డిగూడెం మండలం పాత నాగులూరు గ్రామానికి చెందిన కె. శశాంక డీఎస్సీ-2025 ఎస్జీటీ ఫలితాల్లో 88.177 మార్కులతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 29వ ర్యాంకు సాధించింది. శశాంక భర్త అనిల్ కుమార్ రెడ్డిగూడెం మండలం కొత్త నాగులూరు గ్రామంలో మోడల్ ప్రైమరీ స్కూల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమెను గ్రామస్తులు అభినందించారు.

శ్మశానంలో పంపు సెట్ బిగించాలి

చాట్రాయి: శ్మశానవాటికలో చేతి పంపు సెట్ బిగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చీపురుగూడెం గ్రామంలోని దళిత శ్మశానవాటికలో ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య దళితుల విన్నపం మేరకు బోరు వేయించారు. బోరుకు చేతి పంపు సెట్ బిగించకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించిన వారు స్నానాలు చేయాలంటే నీటి సమస్య తీవ్రంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చేతి పంపు సెట్ బిగించాలని కోరుతున్నారు.